క్లుప్తంగా

11న నూకాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ



నూతనంగా నిర్మించిన నూకాలమ్మ అమ్మవారి ఆలయం

వేపాడ: మండలంలోని కుమ్మపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన నూకాలమ్మ అమ్మ వారి ఆలయంలో ఈ నెల 11న అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. 9వ తేదీన వినాయక పూజ దీక్షాధారణ, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠ, విశేష హోమాలు, ఊరేగింపు, 10వ తేదీన గర్తన్యాసం, రత్నన్యాసం, బీజన్యాసం, ధాతున్యాసం, సూర్య నమస్కారములు, విశేష హోమాలు జరుగుతాయని తెలిపారు. 11న ఉదయం 6.42 నిమిషాలకు విగ్రహ స్థిర ప్రతిష్ఠ, నేత్రోన్మీలనం, గోదర్శనం, కుంభ దర్శనం, బింబ దర్శనం తదితరమైనవి ఉంటాయని గ్రామ పురోహితులు భమిడిమర్రి శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం అన్న సమారాధన ఉంటుందని పేర్కొన్నారు.

సంతాపం



భారతమ్మ (ఫైల్)

వేపాడ: మండలంలోని చామలాపల్లి గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ కుంచి భారతమ్మ(56) ఇటీవల అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఈమెకు భర్త కోటేశ్వరరావు, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. భారతమ్మ మృతికి పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు తమ సంతాపం తెలిపారు. ఆమె కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వేతనదారులకు న్యాయ అవగాహన సదస్సు



వేతనదారులకు సూచనలు చేస్తున్న న్యాయవాది

గజపతినగరం: మండల కేంద్రంలోని సివిల్ కోర్టు సమీపంలో ఉన్న ఓ చెరువులో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులకు బుధవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో స్థానిక న్యాయవాది ఆదినారాయణ పనులు సూచనలు చేశారు. వేతనదారులకు ఉన్న న్యాయ చట్టాలు, హక్కులను వివరించారు. తమ హక్కులకు భంగం కలిగిస్తే న్యాయ స్థానాన్ని ఆశ్రయించవచ్చని సూచించారు.


కొలతల ప్రకారం పని చేస్తేనే వేతనాల గిట్టుబాటు



రోళ్లవాకలో కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఏపీవో

బొండపల్లి: కొలతలు ప్రకారం పని చేస్తే వేతనాలు గిట్టుబాటు అవుతాయని ఉపాధి హామీ ఏపీవో కె.అరుణకుమారి సూచించారు. మండలంలోని రోళ్లవాక గ్రామంలో బుధవారం ఉపాధి పనులు చేపడుతున్న చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలు మస్తర్లను పరిశీలించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం ఆరు గంటలకు పనిలోకి వచ్చి పది గంటలకు పనులు ముగించి, సాయంత్రం నాలుగు గంటలకు తిరిగి పనులు ప్రారంభించి ఆరు గంటలకు పూర్తి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో క్షేత్ర సహాయకుడుతో పాటు కూలీలు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణపై ఫిర్యాదు



చెరువు ఆక్రమణపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు

దత్తిరాజేరు: మండలంలోని గడసాం రెవెన్యూ పరిధి సర్వే నంబరు 3 – 2లో అయ్యప్ప చెరువును కొందరు జేసీబీతో చదును చేసి ఆక్రమించుకోవడంపై స్థానిక రైతులు తహసీల్దార విజయభాస్కర్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. మాజీ ఎంపీటీసీ నేతేటి వెంకటరమణ రైతులతో కలసి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోరలి గ్రామానికి చెందిన కొందరు రైతులు చదును చేయడంతో గ్రామస్తులు అడ్డుకోవడంతో పనులు నిలిపేసి వెళ్లిపోయారని తెలిపారు. టీడీపీ ఎప్పుడు అధికారంలోకి వచ్చినా ఈ చెరువును ఆక్రమించడం పరిపాటిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి సంబంధించి క్షేత్ర స్థాయిలో పరిశీలనకు ఆర్ఐ, వీఆర్‌ఓను పంపిస్తానని తహసీల్దార్‌కు వారికి తెలిపారు.

మట్టి పరీక్ష.. పొలానికి రక్ష

- భూసార పరీక్షలతో సత్ఫలితాలు
- ఎరువులు పెట్టుబడులు ఆదా
- అధిక దిగుబడులకు ఆస్కారం
- ప్రత్యేకంగా దృష్టి సారించిన వ్యవసాయ శాఖ
- ఈ ఏడాది లక్ష్యం 6896 మట్టి పరీక్షలు



పెదమానాపురంలో మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ సిబ్బంది

దత్తిరాజేరు: పంటలకు కావలసిన పోషక విలువలను భూమిలో ఉన్నాయో లేవో తెలుసుకోకుండానే ఎంతో మంది రైతులు వ్యవసాయం చేస్తున్నారు. అధిక దిగుబడులే లక్ష్యంగా రసాయన ఎరువులు పురుగు మందులు విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. దీంతో నేల నిస్సారంగా మారుతోంది. ఈ క్రమంలో ఆశించిన దిగుబడులు రాక నష్టపోతున్నారు.

గజపతినగరం నియోజకవర్గంలో దత్తిరాజేరు, గజపతినగరం, బొండపల్లి, గంట్యాడ మండలాల్లో 138 గ్రామాలలో రైతులు 40,124 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేస్తున్నారు, ఈ క్రమంలో నియోజకవర్గంలో 6,896 వేల మట్టి నమూనాలు సేకరించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. మే 15వ తేదీలోగా శాంపిల్స్ సేకరణ పూర్తి చేసేందుకు రైతు సేవా కేంద్రాలు సిబ్బంది కృషి చేస్తున్నారు.

పంట సాగు చేసే ముందు ప్రతి రైతు భూసారం తెలుసుకొనేందుకు మట్టి పరీక్ష చేసుకోవాలి. పంట కోత ముగిసిన నెల తరువాత మట్టి నమూనా సేకరించాలి. భూసార పరీక్షల వలన ఏ పంట సాగు చేయాలో.. నేల అనుకూలం ఉందో తెలుస్తుంది. రసాయన ఎరువులు ఎంత మోతాదులో వేయాలో తెలుస్తుంది. ఈ పరీక్ష చేయడం వలన భూమికి రక్షగా ఉంటుంది. అనువైన సమయంలో భూసార పరీక్షలు చేయడం ఉత్తమమని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఇష్టానుసారంగా రసాయన ఎరువుల వాడకం వలన భూమిలో సహజ సిద్ధంగా ఉండే పోషకాలు నశించిపోతున్నాయి.

ఈ నేపథ్యంలో రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ సమాయత్తం అయ్యింది. శాస్త్రీయ పద్ధతిలో వ్యవసాయం చేయడానికి భూసార పరీక్షలు ఎంత అవసరమో విస్తృతంగా ప్రచారం చేస్తుంది. విత్తనం వేసే ముందు మట్టి పరీక్షలు చేయించుకొని ఫలితాలను బట్టి నేలకు పోషకాలు అందించేలా వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. భూసార పరీక్షల విధానంలో కూడా కొత్త పద్ధతులను ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. మారిన విధానంలో గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం(జీపీఎస్) ద్వారా మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలను నిర్వహిస్తున్నారు.

రైతులకు అవగాహన కల్పించాం

ప్రస్తుత పరిస్థితుల్లో భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. మట్టి పరీక్షలు ఆధారంగా పంటలు సాగు చేస్తే పెట్టుబడి వ్యయం తగ్గుతుంది. భూసార ప్రయోగ కేంద్రాలలో మట్టికి సంబంధించి నత్రజని సూచిక నేల స్వభావం, లవణ సాంద్రత, కేంద్రీయ కర్బనం, లభ్య పోషకాలు స్థాయిని లెక్కిస్తారు. వాటి ఫలితాలను బట్టి రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తలు యొక్క సూచనలు పాటిస్తే మంచిది. భూసార పరీక్షలపై ఇప్పటికే రైతులకు అవగాహన కల్పించాం.

– మహరాజ్, ఏడీఏ, గజపతినగరం

రైతు సేవా కేంద్రాలలో..

ఎరువుల వినియోగంలో అనవసర ఖర్చులు తగ్గించేందుకు ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలలోనే భూసార పరీక్షలు చేయించుకొనే వెసులుబాటు కల్పించింది. భూమిలో ఉన్న పోషక పదార్థాలే కాకుండా చౌడు గుణాలు, సున్నపు శాతం, నేల కాలుష్యాన్ని గుర్తించేందుకు కూడా ఈ పరీక్షలు ఉపయోగపడుతున్నాయి. పొలంలో సేకరించిన మట్టిని ప్రయోగశాలలో భౌతిక, రసాయనిక పద్ధతులలో విశ్లేషించి నేల స్వభావం లక్షణాలు పోషక విలువలు స్థాయి గుర్తిస్తారు. దీని ద్వారా భూమిలో లోపించిన లవణాలు గురించి దానికి అనుగుణంగా ఎరువులను వేసుకోవడం వలన పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది, ప్రతి మూడేళ్లకు ఒకసారి భూసార పరీక్షలు చేయించుకోవడం మంచిదని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. మరో వైపు మట్టి నమూనా సేకరించే విధానంపై వీఏఏలు, ఏఓలకు వ్యవసాయ శాఖ, మండల స్థాయిలో సూచనలు చేస్తున్నారు. మట్టి నమూనాలు సేకరించి పరీక్షలకు తరలించే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు రైతులకు తెలియజేయాల్సిన వివరాలు సిబ్బందికి సమగ్ర శిక్షణ ఇచ్చారు. ఈ ఏడాది 6896 వేలు మట్టి నమూనాలు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనిలో భాగంగా మే15వ తేదీ నాటికి లక్ష్యం మేరకు నమూనాలను పరీక్షించాలని నిర్దేశించగా ఇప్పటికి నియోజకవర్గంలో 8వందలు మట్టి నమూనాలు సేకరించారు.

అల్లూరి పోరాట స్ఫూర్తి అనుసరణీయం



చీపురుపల్లి: అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న క్షత్రియ సేవా సంఘం ప్రతినిధులు

చీపురుపల్లి: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తి అనుసరణీయమని క్షత్రియ సేవా సంఘం ప్రతినిధులు అన్నారు. అల్లూరి వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దనున్న ఆయన విగ్రహానికి క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని నేతలు పిలుపునిచ్చారు.



కొత్తవలస : తహసీల్దార్ కార్యాలయం వద్ద అల్లూరి వర్ధంతి

విప్లవ వీరుడు అల్లూరి

కొత్తవలస : విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. తహసీల్దార్ బి.నీలకంఠరావు అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. క్షత్రియ సమితి కార్యదర్శి పాకలపాటి శ్రీనివాసవర్మ, అధ్యక్షుడు గోపిరాజు, బంగార్రాజు, జి.వెంకటపతిరాజు, శ్రీనురాజు తదితరులు పాల్గొన్నారు.

కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలి

బొండపల్లి: ప్రభుత్వం కొత్తగా రేషన్ కార్డుల మంజూరు కోసం నిర్దేశించిన మార్గ దర్శకాలు మేరకు 7 రకాలైన సేవలు పొందేందుగాను సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు బుధవారం తెలిపారు. సచివాలయాల్లో కొత్తగా రేషను కార్డులు కావాల్సిన వారితో పాటు, కార్డులో పేర్లు చేర్చడం, తొలగించడం వంటి వాటితో పాటు వివిధ రేషన్ కార్డుల్లో వచ్చిన సమస్యలు పరిష్కారం కోసం తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క కార్డుదారుడు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పచ్చిరొట్ట సాగుతో భూమికి మేలు



రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను అందజేస్తున్న ఏవో

చీపురుపల్లి రూరల్(గరివిడి): పచ్చిరొట్ట విత్తనాలను సాగు చేయటం వలన భూసారానికి ఎంతగానో దోహదపడుతుందని ఏవో శైలజ రైతులకు సూచించారు. గరివిడి మండలంలోని గెడ్డపువలస గ్రామంలో పచ్చిరొట్ట విత్తనాలు, నవధాన్యాలతో విత్తనాల కిట్లును తయారు చేసి రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పచ్చిరొట్టను సాగు చేయటం వలన పంటకు అవసరమయ్యే పోషకాలు సేంద్రీయ రూపంలో అందుతుందని తెలిపారు. ఈ పంటను సాగు చేసి పూత సమయానికి భూమిలో కలియదున్నటం వలన ఎరువుగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ విధానం వలన ఎరువుల ఖర్చు తగ్గటమే కాకుండా భూమి సారవంతంగా మారుతుందన్నారు.

అధికారుల తీరుపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

- దత్తిరాజేరు మండల సమావేశం



హౌసింగ్ ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజాప్రతినిధులు

దత్తిరాజేరు: అధికారుల తీరుపై పలువురు ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. సమావేశంలో ఎంపీపీతో పాటు జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, ఉప ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్ అధికారులు తీరుపై ఆగ్రహించారు. హౌసింగ్ ఏఈగా బాధ్యతలు చేపట్టి ఆరు నెలలవుతున్నా ఇప్పటి వరకు తనకు ఆయన తెలియదని ఏఈపై జెడ్పీటీసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. గృహాల మంజూరులో అర్హత లేని వారికి మంజూరు చేస్తున్నారని గడసాం, చినకాద సర్పంచ్‌ల ప్రతినిధులు నేతేటి వెంకటరమణ, ఆవుగడ్డి మురార్జీ ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంగిలాపల్లిలో గత ప్రభుత్వంలో నాడు – నేడు నిధులతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని వినియోగించకుండా అద్దె భవనంలో నిర్వహించడం వల్ల ప్రభుత్వ సొమ్ము వృథా చేస్తున్నారని ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ బమ్మిడి అప్పలనాయుడు తెలిపారు. ఎంపీపీ కలుగజేసుకొని ఉన్నతాధికారుల దృష్టికి సమస్య తీసుకువెళ్లి పరిష్కరించకపోతే తమ పని తాము చేస్తామని సీడీపీవో నాగమణికి తెలిపారు. చినకాద గ్రామంలో మార్చి నెలలో ఐడీ నంబరు రాకుండా ఉపాధి పనులు చేయించడంతో వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ ప్రతినిధి మురార్జీ అధికారుల దృష్టికి తెచ్చారు. దీన్ని పరిశీలించి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఉపాధి ఏపీవోకు సూచించారు. తాగునీటి ట్యాంకుల క్లినింగ్‌కు పంచాయతీ నిధులు ఇవ్వలేదని సర్పంచ్ ప్రతినిధి నేతేటి వెంకటరమణ ఎంపీపీ దృష్టికి తెచ్చారు. అనంతరం వ్యవసాయం, విద్య, వైద్యం, ఉద్యానవన తదితర శాఖల వారీగా ప్రగతిని సంబంధిత అధికారులు చదివి వినిపించారు.

కుట్టు మిషన్లలో భారీ స్కామ్



జమ్ము స్వామి నాయుడు

గుర్ల: బీసీ మహిళలకు కుట్టు మిషన్లు శిక్షణ, పంపిణీలలో భారీ స్కామ్ జరుగుతుందని చీపురుపల్లి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు జమ్ము స్వామినాయుడు ఆరోపించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన బుధవారం మాట్లాడారు. నియోజకవర్గంలో అర్హులైనా వారికి శిక్షణ ఇవ్వకుండా కూటమి నేతలు సిఫార్సులు చేసిన వారికే మాత్రమే శిక్షణ ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుట్టు మిషన్లు ఉన్న వారికే మళ్లీ శిక్షణ ఇచ్చి వారికే కుట్టు మిషన్లు అందిస్తున్నారని ఆరోపించారు. కూటమి నేతలు చెప్పిన వారు శిక్షణకు రాకపోయిన వచ్చినట్లు హాజరు వేసి, మొక్కుబడిగా ఒక్కసారి మాత్రమే బయోమెట్రిక్ తీసుకొని శిక్షణ ఇవ్వకుండా పంపించేస్తున్నారన్నారు. కుట్టు మిషన్లు స్కాంపై విచారణ చేయించాలని డిమాండ్ చేశారు.

పేదల వివాహాలకు సహకారం



ఇందుమతి కుటుంబానికి ఫ్రిజ్ అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

చీపురుపల్లి: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పేదల ఇళ్లల్లో ఆడ పిల్లల వివాహాలకు తమ ట్రస్టు నుంచి సహకారం కొనసాగిస్తున్నట్టు శ్రీ దుర్గామల్లేశ్వర సేవా ట్రస్టు వ్యవస్థాపకుడు ముల్లు రమణ చెప్పారు. పట్టణంలోని కస్పావీధిలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గరివిడి మండలంలోని బొండపల్లి గ్రామానికి చెందిన ఇందుమతి, కెఎల్.పురం గ్రామానికి చెందిన కుసుమకుమారి, చీపురుపల్లిలోని లావేరు రోడ్‌కు చెందిన లావణ్య వివాహాలకు ఒక్కొక్కరికీ ఫ్రిజ్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ ట్రస్టు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక అభివృద్ధితో పాటు పేద ఆడ పిల్లల వివాహాలకు సహకారం అందిస్తున్నట్టు చెప్పారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

గజపతినగరం : గజపతినగరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపట్టనుండడంతో శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్టు బొబ్బిలి డివిజన్ విద్యుత్ కార్య నిర్వాహక ఇంజినీరు ఎ.అనంతరావు బుధవారం తెలిపారు. గజపతినగరం, ఎం.వెంకటాపురం, పురిటిపెంట, పిడిశీల, డోళపాలెం, సీతారామపురం, శ్రీరంగరాజపురం, మధుపాడ, మరుపల్లి, తమ్మారాయుడుపేట, ఎం.గుమడాం, గంగచోళ్ల పెంట, పత్రువాడ, కొత్తబగ్గాం, పాతబగ్గాం, బంగారమ్మపేట, భూదేవిపేట, దావాలపేట, బూడిపేట తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలుపు చేయనున్నట్టు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

వేపాడ: పర్యావరణ పరిరక్షణ మొక్కలతోనే సాధ్యమని గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్(జియో) స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు బి.రామకృష్ణ అన్నారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో రామస్వామిపేట సమీపంలో స్వయం భూ లింగాలయం ఆవరణలో బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీఎం డైరెక్టర్ వై.విజయలక్ష్మి, ఎ.ప్రభాస్, బి.హృషికేష్, లాస్యశ్రీ, ఆలయ కమిటీ సభ్యులు వల్లంశెట్టి త్రినాద్, వి.హరి పాల్గొన్నారు

● బండి.. కదలదండి...





అత్యవసర సమయాల్లో సేవలందించి ప్రాణాలు రక్షించే 108 వాహనం, ఆరోగ్య పరీక్షలు జరిపి అవసరమైన మందులిచ్చే 104 వాహనం రెండు వాహనాలు కదలనంటున్నాయి. ఈ రెండు వాహనాలు చీపురుపల్లి ఏరియా ఆస్పత్రి ఆవరణలో కొద్ది నెలలుగా మూలనపడి ఉన్నాయి. మరమ్మతులకు గురైన వాటిని అలానే వదిలేశారు. అయితే వీటి స్థానంలో అదనపు వాహనాలను ఏర్పాటు చేశారు. వీటిని కూడా మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకువస్తే మరిన్ని సేవలు అందే అవకాశం ఉంటుందంటూ స్థానికులు సూచిస్తున్నారు.

– చీపురుపల్లి

● ఇది వ్యవసాయ శాఖ కార్యాలయమే...



ఈ చిత్రంలో కనిపిస్తున్నది చీపురుపల్లిలోని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం. చూస్తే ఇది పాడుబడి మూతపడిన కార్యాలయంలా కనిస్తుంది. కానీ ఈ కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఏడీతో పాటు సిబ్బంది కూడా విధులు నిర్వహిస్తున్నారు. కానీ కార్యాలయం చుట్టూ పిచ్చి మొక్కలు లేచి అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. ప్రభుత్వం ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర పేరిట కార్యక్రమం నిర్వహిస్తున్నా.. ఈ కార్యాలయం వద్ద అటువంటి జాడలు కానరావడం లేదు.

– చీపురుపల్లి

● వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం



మెరకముడిదాం మండలం బుధరాయవలస గ్రామంలో శ్రీశ్రీశ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవాన్ని భక్తులు బుధవారం వేడుకగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి చెందిన పలువురు దంపతులు స్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్న సమారాధన నిర్వహించారు.

– మెరకముడిదాం

ఎంఆర్‌సీలకు పాఠ్య పుస్తకాలు



స్టాక్ పాయింట్‌లో వున్న పాఠ్య పుస్తకాలను పరిశీలిస్తున్న ఎస్ఎస్ఏ అధికారులు

మెరకముడిదాం: ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకూ చదువుతున్న విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన స్టాకు పాయింట్లు వద్దకు సక్రమంగా చేరుకుంటున్నాయని ఎస్ఎస్ఏ సీఎంవో వి.ఆదినారాయణ తెలిపారు. మండల కేంద్రంలోని స్టాక్ పాయింట్ అయిన జెడ్పీ పాఠశాలలో పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలను ఎస్ఎస్ఏ అధికారులు బుధవారం పరిశీలించారు. ప్రభుత్వం అందించిన గైడ్‌లైన్స్ ప్రకారం ఏ తరగతి పుస్తకాలను అక్కడే పెట్టారని అన్ని పుస్తకాలను సక్రమంగా పంపిణీ చేసేందుకు సిద్ధం చేసి వుంచారన్నారు. అలాగే అక్కడ వున్న సిబ్బందితో మాట్లాడుతూ జిల్లా కేంద్రం నుంచి ఇంతవరకూ వచ్చిన పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పుస్తకాల పంపిణీలో ఎలాంటి అక్రమాలకు తావివ్వకుండా పక్కా ప్రణాళిక ప్రకారం పుస్తకాలను పంపిణీ చేయాలన్నారు. వారి వెంట అసిస్టెంట్ సీఎంవో ఎ.రామారావు, ఎంఈవో 1, 2లు చంద్రశేఖర్, ధర్మశ్రీను, ఎంఆర్‌సీ సిబ్బంది, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు, సీఆర్ఎంటీలు, ఐఆర్‌టీలు ఉన్నారు.

రాయితీపై పశు దాణా పంపిణీ



రాయితీపై పశు దాణాను అందజేస్తున్న ఎమ్మెల్యే

లక్కవరపుకోట : పాడి రైతులకు ప్రభుత్వం 50 శాతం రాయితీపై పశుదాణాను అందజేస్తోందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రం వద్ద రైతులకు ఆమె బుధవారం పశుదాణాను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడి రైతులను మరింత ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఎన్నో పథకాలను రూపొందిస్తోందని తెలిపారు. ఇందులో భాగంగానే 50 శాతం రాయితీపై దాణాను అందజేస్తున్నట్టు ఆమె తెలిపారు. పశు సంవర్ధక శాఖ ఏడీ బి.గంగాధర్ మాట్లాడుతూ తెల్లరేషన్ కార్డు గల పాడి రైతుకి ఈ దాణాను అందజేస్తున్నట్టు తెలిపారు. కొత్తవలస, లక్కవరపుకోట మండలాలకు ఐదు వందల బస్తాలను కేటాయించినట్టు ఆయన తెలిపారు. కావల్సిన రైతులు సమీపంలో గల రైతుమిత్ర సేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారిణి గాయిత్రి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

వైద్య శిబిరాల్లో రోగులకు పరీక్షలు



పురిటి పెంట-2లో రోగులను తనిఖీ చేస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి

గజపతినగరం : గజపతినగరం – 2, పురిటిపెంట – 2 గ్రామ సచివాలయాల్లో బుధవారం వేర్వేరుగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాల్లో రోగులకు తనిఖీలు నిర్వహించినట్టు మరుపల్లి పీహెచ్‌సీ వైద్యులు సాయికృష్ణారెడ్డి, పుష్పాంజలి తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో పురిటి పెంట-2లో డాక్టర్ సాయికృష్ణ 59మంది రోగులకు, గజపతినగరం -2లో డాక్టర్ పుష్పాంజలి 62మందికి వేర్వేరుగా తనిఖీలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది తమ వంతు సేవలందించారు.

వాసవీ జయంత్యుత్సవం

శృంగవరపుకోట: వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాలను ఎస్.కోట ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 5గంటలకు అమ్మవారికి సుప్రభాతసేవ, అభిషేకం, అలంకరణ, ఊరేగింపు ఉత్సవాలను చేశారు. మండపంలో పలువురు మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. వేణుగోపాలస్వామి ఆలయం నుంచి దేవీ జంక్షన్ వరకూ అమ్మవారిని మేళతాళాలతో, భాజా భజంత్రీలతో ప్రత్యేక పల్లకిలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు హెచ్.నానాజీ తదితరులు పాల్గొన్నారు.

'సిందూర్' కోసం పూజలు

శృంగవరపుకోట : భారత సైనం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని కోరుతూ బుధవారం వాసవీ వనితలు పూజలు చేశారు. మండలంలో బొడ్డవర గ్రామంలో ఆర్యవైశ్య మహిళలు వారి కులదేవత వాసవీమాతకు పూజలు చేశారు. ప్రస్తుతం భారత్ ఎదుర్కొంటున్న ఉగ్రవాదం అణిచి వేయటానికి భారత్ సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని అమ్మవారికి పూజలు చేశారు.

క్యాంపస్ సెలక్షన్లలో 32 మంది ఎంపిక

శృంగవరపుకోట : పట్టణంలోని వివేకానంద కళాశాలలో బుధవారం దివీస్ కంపెనీ వారు క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించారు. 65 మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారు. వీరిలో 32 మంది ఇంటర్వ్యూలు పూర్తి చేసి ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరంతా ఈ నెల 30వ తేదీలోగా ఉద్యోగాల్లో చేరవచ్చని కంపెనీ ప్రతినిధులు తెలిపారు.

కూలిన విద్యుత్ స్తంభాలు

దత్తిరాజేరు : మండలంలో పలుచోట్ల బుధవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షం ఈదురు గాలులకు తొమ్మిది విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దత్తిరాజేరు, రామచంద్రపురం, పోరళి తదితర గ్రామాల్లో ఈ స్తంభాలు కూలాయి. విద్యుత్ శాఖ ఏఈ ఆదిత్య వద్ద ప్రస్తావించగా గురువారం పునరుద్ధరిస్తామని తెలిపారు.